మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో మార్గం పరిశీలన

రోడ్‌షో మార్గాన్ని పరిశీలిస్తున్న జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 22 : ఈ నెల 25న భువనగిరిలో నిర్వహించే మాజీ సీఎం కేసీఆర్ రోడ్‌షో మార్గాన్ని జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. భువనగిరిలోని సాయిబాబా ఆలయం నుంచి వినాయక చౌరస్తా వరకు నిర్వహించే రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలకు, వ్యాపారస్తులకు, ప్రయాణికులకు అంతరాయం కలుగకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్నబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పట్టణ, మండలాధ్యక్షులు ఏవీ కిరణ్‌కుమార్, జనగాం పాండు, పట్టణ ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- డీఆర్‌డీఓ ఎంఏ కృష్ణన్

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ ఎంఏ కృష్ణన్

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 22 : ఉపాధి హామీ పని ప్రదేశంలో కూలీలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని డీఆర్‌డీఓ ఎంఏ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో భువనగిరి, ఆత్మకూరు(ఎం) మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో నర్సరీల నిర్వహణకు సమగ్ర చర్యలు చేపట్టాలన్నారు. కూలీలలకు గిట్టుబాటు కూలి అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ సురేశ్, డీఎల్‌పీఓ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రావు, ఎంపీఓలు, ఈసీలు, టెక్నికల్ ఆఫీసర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి

- ఆ పార్టీ మండలాధ్యక్షుడు రాంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాంరెడ్డి

రాజాపేట, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు, మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గడప గడపకూ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. భువనగిరి ఖిలాపై ఎగిరేది గులాబీ జెండాయేనని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అందుబాటులో ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. మండలాధ్యక్షుడిగా తన ఎంపికకు కృషి చేసిన ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, నాగిర్తి జనార్దన్‌రెడ్డి, భాస్కర్, రామిడి రాంరెడ్డి, గంధమల్ల సురేశ్, దొబ్బల గణేశ్ పాల్గొన్నారు.

మహనీయుల జయంతి కరపత్రం ఆవిష్కరణ

మహనీయుల జయంతి కరపత్రం ఆవిష్కరిస్తున్న బీపీఎస్ నాయకులు

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 22 : పట్టణ కేంద్రంలో బహుజన ప్రజాశక్తి ఆధ్వర్యంలో మహనీయుల జయంతి కరపత్రాలను బీపీఎస్ రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయుల జయంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ దేవరాయ కుమార్, బహుజన ప్రజాశక్తి రాష్ట్ర నాయకుడు చింతకింది రమేశ్, ఎరుకల సంఘం మండలాధ్యక్షుడు దేవరాయ భిక్షపతి, పట్టణాధ్యక్షుడు సుధాకర్, నాయకులు నర్సింహ, శ్రీరాములు, ఇస్తారి, సంపత్, కిష్టయ్య, భరత్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

- జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు

కొలనుపాకలో గీత కార్మికులకు సూచనలు చేస్తున్న జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 22 : గీత కార్మికులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి అని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సైదులు అన్నారు. సోమవారం మండలంలోని కొలనుపాక కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను రూపొందించాలని సూచించారు. సొసైటీలోని ప్రతి సభ్యుడికి గుర్తింపు కార్డు విధిగా ఉండాలన్నారు. ఆయన వెంట భువనగిరి, ఆలేరు సీఐలు రాధాకిషన్, దీపిక, ఎస్ఐ విజయ్‌సారథి, గీత కార్మికులు ఉన్నారు.

చలి వేంద్రం ఏర్పాటు

చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రైతుబంధు సమితి మాజీ డైరెక్టర్ ధనలక్ష్మి

ఆత్మకూరు(ఎం), ఏప్రిల్ 22 : మండల కేంద్రంలోని సబ్ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని రైతు బంధు సమితి మాజీ డైరెక్టర్ బీసు ధనలక్ష్మీచందర్ గౌడ్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో వరలక్ష్మి, పద్మ, అండమ్మ, శిరీష, శ్రీలత పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో కరువు

- సీఎం రేవంత్‌రెడ్డి పచ్చి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేస్తుండు
- గుండాలలో బీఆర్ఎస్ రోడ్‌షోలో మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత
- ఆశీర్వదించండి.. భువనగిరి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తా : బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్
- హాజరైన జిల్లా నాయకులు

గుండాల : రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్

గుండాల, ఏప్రిల్ 22 : కాంగ్రెస్ వచ్చి కరువు తెచ్చిందని, నేడు ఆ పార్టీ పాలనలో సాగు, తాగునీటికి ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం గుండాల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుంచి గ్రంథాలయం సెంటర్ వరకు ఆ పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలేరు ప్రాంతం నాడు కేసీఆర్ పాలనలో ఎంతో అభివృద్ధి చెందిందని, రైతులు సంతోషంగా ఉన్నారని, నేడు కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనంతరం బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ మాట్లాడుతూ.. తాను కింది స్థాయి నుంచి వచ్చిన బడుగు, బలహీన వర్గాలకు చెందిన బీసీ బిడ్డనని, తనకు పేదల సమస్యలు తెలుసని అన్నారు. కాంగ్రెస్ 4 నెలల పాలనలో రాష్ట్రం పది సంవత్సరాల వెనక్కి వెళ్లిందని పేర్కొన్నారు. కేంద్రంలో 10 ఏండ్లు బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ అభివృద్ధి శూన్యమని అన్నారు. కాంగ్రెస్ ఎంపీలు రాష్ట్ర అభివృద్ధి కోసం కనీసం నోరు కూడా విప్పలేదన్నారు. బీజేపీ వాళ్లు మతం పేరుతో రాజకీయం చేస్తున్నారని, మనం మన తాతల నుంచి రాముడినే మొక్కుతున్నామని, మత విద్వేషాలు రెచ్చగొట్టే బీజేపీని నమ్మవద్దని తెలిపారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ క్లిష్ట పరిస్థితుల్లో ఉందని, తనను గెలిపిస్తే ప్రజల గొంతుకను పార్లమెంటులో వినిపిస్తానని చెప్పారు. తనపై పోటీ చేస్తున్న వ్యక్తిది నీచమైన చరిత్ర అని, తనపై ఇప్పటి వరకు సింగల్ కేసు కూడా లేదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆలోచనలు ఎప్పుడూ ప్రజల అభివృద్ధి కోసమేనని, ఆయనతోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, తనను ఎంపీగా గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్, రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్ గౌడ్ మాట్లాడుతూ.. రైతుబంధు, రుణమాఫీ, తులం బంగారం, మహిళలకు 2500 ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రజలను మోసం చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను పక్కదోవ పట్టిస్తుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు ఎలాంటి కష్టం రాకుండా కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడినట్లు గుర్తుచేశారు. క్యామ మల్లేశ్ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అంతకు ముందు క్యామ మల్లేశ్‌కు బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. కోలాటం, డప్పుచప్పుళ్ల నడుమ జై కేసీఆర్ నినాదాలతో గుండాల మార్మోగింది. ఎంపీపీ తాండ్ర అమరావతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఖలీల్, వైస్ ఎంపీపీ మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు రామకృష్ణారెడ్డి, పాండరి, నాయకులు మూగల శ్రీనివాస్, సంగి వేణుగోపాల్, కోలుకొండ రాములు, అంజిరెడ్డి, శ్రీనివాస్, రమేశ్, రంజిత్‌రెడ్డి, జటంగి రాజు, మహోదయ్, దయాకర్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్‌షోలో పెద్దఎత్తున పాల్గొన్న జనం

కరాటేలో మాంటిస్సోరి విద్యార్థుల ప్రతిభ

ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బీబీనగర్, ఏప్రిల్ 22 : స్టాండర్డ్ షిటొర్యో ఇంటర్నేషనల్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని మాంటిస్సోరి స్కూల్‌లో కరాటే బెల్టుల కోసం పలు పరీక్షలు నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు 175 మంది పాల్గొని ప్రతిభ ప్రతిభ కనబరిచారు.

వారికి పాఠశాల కరస్పాండెంట్ లహరి చంద్ర చేతుల మీదుగా ఎల్లో, ఆరంజ్ బెల్ట్‌తో పాటు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలను మానసిక ఒత్తిడికి గురి చేయొద్దు

- ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 22 : పరీక్షల కంటే జీవితం గొప్పదని, విద్యార్థులు నిరాశకు గురి కాకుండా ఉండాలని తెలంగాణ సైకాలజికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ సీనియర్ సైకాలజిస్ట్ డాక్టర్ ఎంఏ కరీం అన్నారు. సోమవారం భూదాన్‌పోచంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదల నేపథ్యంలో పిల్లల మానసిక స్థితిపై దృష్టి కేంద్రీకరించాలని, పరీక్ష ఫలితాలే జీవితం కాదని, అది కేవలం జీవితంలో ఒక భాగం మాత్రమే అని గుర్తించేలా పిల్లలకు చెప్పాలన్నారు. పరీక్ష ఫలితాలు అనుకున్న విధంగా రాలేదని, పరీక్షల్లో విజయం సాధించలేదని, మార్కులు, ర్యాంకులు అంటూ పిల్లలను మానసిక ఒత్తిడికి గురి చేయవద్దని సూచించారు. ఫలితాలు ఎలా వచ్చినా వాటిని స్వీకరించేలా పిల్లలను మానసికంగా సిద్ధం చేయాలన్నారు. పరీక్షలు పూర్తయిన తర్వాత పిల్లలు ఆనందంగా ఉంటారని, రిజల్ట్స్ అనేసరికి ఒక్కసారిగా వారిలో ఆందోళన పెరిగి ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఎన్నారం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

పాఠశాల విద్యార్థిని సన్మానిస్తున్న రాజగోపాల్

రామన్నపేట, ఏప్రిల్ 22 : మండలంలోని ఎన్నారం ప్రాథమిక పాఠశాలలో సోమవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. 5వ తరగతి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు రాజగోపాల్ మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అభినందనీయమన్నారు. అనంతరం దాతలు, గురుకులంలో సీట్లు సాధించిన విద్యార్థులను సన్మానించారు.

కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు నగేశ్, వెంకటేశం పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 22 : కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ పరోక్షంగా కేంద్రంలో బీజేపీకి సహకరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి డిమండ్ చేశారు. మండల కేంద్రంలోని ఆ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో ఎస్ఆర్ వెంకటేశ్వర్లు, చెరుకు పెద్దులు, వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి, చింతపల్లి బయ్యన్న, ఐలయ్య పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 22 : హత్య కేసులో నిందితుడికి భువనగిరి కోర్టు జీవిత ఖైదు విధించింది. కేసు తీర్పు వివరాలు.. తుర్కపల్లి మండలం మాదాపూర్‌కు చెందిన ఎర్రబెల్లి వెంకటేశం తన భార్య కృష్ణవేణితో తరచూ గొడవ పడుతుండేవాడు. ఈ క్రమంలో 24 డిసెంబర్, 2021న గొడవ జరిగే క్రమంలో కృష్ణవేణి సోదరుడు రాచకొండ రమేశ్ తన చెల్లితో ఎందుకు గొడవపడుతున్నావని వెంకటేశాన్ని మందలించాడు. దాంతో వెంకటేశం ఆగ్రహంతో తన బావమరిది రమేశ్‌ను ఇటుకతో తీవ్రంగా గాయపర్చాడు. అతన్ని భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఈ ఘటనపై రమేశ్ భార్య అనిత తుర్కపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. క్రిమినల్ కేసుగా రిజిస్టర్ చేశారు. అప్పటి సీఐ నవీన్‌రెడ్డి, ఎస్ఐ మధుబాబు కేసు విచారణ చేపట్టి నిందితుడిని కోర్టుకు రిమాండ్ చేశారు. ఈ కేసు జిల్లా ప్రధాన న్యాయస్థానంలో సోమవారం పూర్తి విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జయరాజు వెంకటేశానికి జీవిత ఖైదుతోపాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. కేసు విచారణలో శ్రీనివాస్‌రెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా వ్యవహరించగా, తుర్కపల్లి కోర్టు కానిస్టేబుల్ అశోక్ విధులు నిర్వర్తించారు.

నర్సింహ కుటుంబానికి బియ్యం అందజేత

సంస్థాన్‌నారాయణపురం, ఏప్రిల్ 22 : మండల కేంద్రానికి చెందిన చిలివేరు నర్సింహ, పద్మ దంపతులు ఇద్దరు మృతి చెందారు. వారి కూతురు వివాహం ఈ నెల 24న జరుగనుండగా విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకుడు జక్కడి ధన్వంత్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు సోమవారం 2 క్వింటాళ్ల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు లారీ భిక్షం, పీఏసీఎస్ డైరెక్టర్ బొడ్డుపల్లి గాలయ్య, ఎడ్ల సత్తయ్య, జక్కిడి యాదిరెడ్డి, రాసాల వెంకటేశ్, రాచకొండ గిరి, చంద్రశేఖర్, మురళి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అడ్డగూడూరు, ఏప్రిల్ 22 : మండలంలోని చౌళ్లరామారం గ్రామానికి చెందిన మందుల మహేశ్(34) అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు రూ.10 వేల నగదును బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులకు సోమవారం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు తోట కృష్ణారెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ పోగుల నర్సిరెడ్డి, నాయకులు పురుషోత్తం, మెట్టు భాస్కర్‌రెడ్డి, మందుల కిరణ్, నవీన్‌కుమార్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

గుట్ట లక్ష్మీనరసింహుడి నిత్య తిరుకల్యాణం

రామలింగేశ్వర స్వామి ఆలయంలో రుద్రహోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 22 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. సోమవారం ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవ మూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవ జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా జరిగాయి. అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ప్రధానాలయంలో పరమశివుడు, స్ఫటిక లింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు. సుమారు 9 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ. 22,56,818ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌కు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులతో విజయం సాధిస్తా

- బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 22 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆశీస్సులు తమపై మెండుగా ఉన్నాయని, స్వామి వారి దయతో పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధిస్తామని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. యాదగిరీశుడిని సోమవారం మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, తన కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్యామ మల్లేశ్ మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనను ప్రజలు నేటికీ గుర్తు చేసుకుంటున్నారని, కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు తెలంగాణ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వారి వెంట జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి ఉన్నారు.

క్యామ మల్లేశ్‌పై కేసులు లేవు..

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ తన ఆస్తులను అఫిడవిట్ రూపంలో సోమవారం సమర్పించారు. మల్లేశ్ తన నామినేషన్ దాఖలు సందర్భంగా రిటర్నింగ్ అధికారికి అఫిడవిట్ అందజేశారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం శేరిగూడేనికి చెందిన క్యామ మల్లేశ్ వృత్తి రీత్యా వ్యాపారి. అఫిడవిట్‌లో వెల్లడించిన వివరాలు ఇలా ఉన్నాయి.

- క్యామ మల్లేశ్ మొత్తం ఆస్తులు రూ.119,14,55,701.
- ఇందులో చరాస్తులు 2,15,79,701, స్థిరాస్తులు 116,98,76,000.
- ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్ సోషల్ మీడియా ఖాతాలు ఉన్నాయి.
- మల్లేశ్ చేతిలో 60వేల నగదు ఉన్నట్లు చూపించారు.
- 73,69,701 బ్యాంకు బ్యాలెన్స్ ఉంది.
- మల్లేశ్ పేరుపై ఎలాంటి బాండ్లు లేవు.
- టయోటా ఫార్చూనర్, మెర్సిడెజ్ బెంజ్ కార్లు ఉన్నాయి.
- సుమారు ఏడు లక్షల విలువ చేసే 100 గ్రాముల బంగారం ఉంది.
- క్యామ మల్లేశ్‌పై ఎలాంటి కేసులు లేవు.

మల్లేశ్ భార్య జంగమ్మ పేరున ఆస్తులు..

- 26,20,36,820 ఆస్తులు ఉన్నాయి.
- ఇందులో 1,20,36,820 చరాస్తులు, సుమారు 25 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి.
- చేతిలో 40 వేల నగదు ఉండగా, 22,16,820 బ్యాంకు బ్యాలెన్స్ ఉంది.
- టయోటా ఇన్నోవా, క్రిష్ట ఉన్నాయి.
- 70 లక్షల విలువ చేసే 1000 గ్రాముల బంగారం ఉంది.

క్యామ మల్లేశ్‌ను కలిసిన మోటకొండూర్ బీఆర్ఎస్ నాయకులు

మోటకొండూర్, ఏప్రిల్ 22 : బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సూదగాని హరిశంకర్‌గౌడ్‌ని మోటకొండూర్ బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం భువనగిరి కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసిన క్యామ మల్లేశ్‌కి ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మోటకొండూర్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, సీనియర్ నాయకులు పైళ్ల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

క్యామ మల్లేశ్ నామినేషన్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

అడ్డగూడూరు నుంచి భువనగిరికి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

అడ్డగూడూరు, ఏప్రిల్ 22 : భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా క్యామ మల్లేశ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం అడ్డగూడూరు నుంచి బీఆర్ఎస్ నాయకులు భువనగిరికి తరలివెళ్లారు. తరలిన వారిలో మాజీ ఎంపీటీసీ పూలపల్లి జనార్దన్‌రెడ్డి, గజ్జెల్లి రవి, బాలెంల అరవింద్, పోలెపాక అబ్బులు, గూడెపు పరమేశ్, పయ్యావుల మత్స్యగిరి, బాలెంల అయోధ్య, కృష్ణ, సోమన్న, శంకర్ రెడ్డి ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 22 : అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన సోమవారం పట్టణంలో చోటుచేసుకుంది. యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని ఎంవీఆర్ లాడ్జిలో ఆదివారం అర్ధరాత్రి ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడి వయస్సు 40 ఏండ్లు ఉంటాయని, ఆచూకీ తెలిసినవారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తెలిపారు. కాగా, పట్టణంలోని లాడ్జిల్లో రూమ్‌లు తీసుకోవాలంటే ఆధార్ కార్డు తప్పనిసరి నిబంధన ఉంది. కానీ, లాడ్జి నిర్వాహకులు మాత్రం నిబంధనలు బేఖాతర్ చేసి గుర్తు తెలియని వ్యక్తికి రూమ్ ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.